RNI NO. TELTEL/2023/87655
18-05-2025
# దీక్ష ప్రభ
ఆదివారం
సంపుటి : 03 సంచిక : 39 పేజీలు : 4 | రూ.5
www.deekshaprabha.com
Follow: deekshaprabha

## ఢిల్లీలో ఈదురుగాలులతో భారీ వర్షం

- అనేక ప్రాంతాల్లో కూలిన చెట్లు
- గోడకూలి ముగ్గురు కూలీలు మృతి



**న్యూఢిల్లీ,దీక్షప్రభ:** ఢిల్లీలో శనివారం బలమైన గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. నగర వాసులు వేడి నుంచి కొంత ఉపశమనం పొందారు. అయితే.. వర్షం, బలమైన గాలుల కారణంగా నష్టం జరిగింది. అనేక ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. నబీ రీం ప్రాంతంలోని అర్కాన్షా రోడ్డు వద్ద నిర్మాణంలో ఉన్న ఇంటి గోడ కూలిపోయింది. ఈ ప్రమాదంలో ముగ్గురు కూలీలు మృతి చెందగా, ముగ్గురు గాయపడ్డారు. ఈ ప్రదేశం నుంచి అందరినీ మిగతా 2లో..

## త్వరలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ

### మెట్రో ఛార్జీల పెంపును పరిశీలిస్తాం

### హైదరాబాద్ అభివృద్ధిపై సమీక్షించిన మంత్రి పొన్నం



**హైదరాబాద్,దీక్షప్రభ:** తెలంగాణ రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డులు త్వరలో పంపిణీ చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. అలాగే, మిగతా 2లో..



## మహిళలే దేశానికి ఆదర్శం

### అందుకు ఇందిరాగాంధీ నిదర్శనం

### కోటీశ్వరులను చేయాలన్నదే నా లక్ష్యం

### వీ హబ్ వుమెన్ యాక్సిలరేషన్ కార్యక్రమంలో సిఎం రేవంత్

**హైదరాబాద్,దీక్షప్రభ:** మహిళలే దేశానికి ఆదర్శమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కోటి మంది మహిళలు కోటీశ్వరులు కావాలనేదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ జేఆర్‌సీ కన్వెన్షన్‌లో వీహబ్ వుమెన్ యాక్సిలరేషన్ కార్యక్రమాన్ని సీఎం రేవంత్ ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు- చేసిన స్టాళ్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ..కోటిమంది మహిళలు కోటీశ్వరులు అయితే, ఆర్థికంగా రాష్ట్రం కూడా అభివృద్ధి చెందుతుందని అన్నారు. మహిళా శక్తిని ప్రపంచానికి ఇందిరాగాంధీ చూపించారు. రాష్ట్రం 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ చేరుకోవాలంటే కోటి మంది మహిళలు కోటీశ్వరులు కావాలి. మహిళల కోసం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం తీసుకొచ్చాం. ఆడబిడ్డలకు రూ.500కే సిలిండర్ అందిస్తున్నాం. అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్వహణను మహిళలకే అప్పగించాం. మిగతా 2లో..

## సిఎంతో నోబెల్ గ్రహీత అభిజిత్ భేటీ

### త్వరలో తెలంగాణ రైజింగ్ విజన్ బోర్డు

### బోర్డులో భాగస్వామి కావాలసి రేవంత్ అభ్యర్థన



2లో

## పాక్ దుర్నీతిని ఎండగట్టేందుకు దౌత్యనీతి

### విదేశాలకు వివరించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం

### ఏడుగురు ఎంపిలతో ఏడు బృందాల ఏర్పాటు

### శశిథరూర్, కనిమోళి, సుప్రీయా సూలెలకు చోటు

### థరూర్ పేరను కావాలనే ఎంపిక చేసిన ప్రభుత్వం

**న్యూఢిల్లీ,దీక్షప్రభ:** భారత్‌పై ఉగ్రవాదాన్ని ఉసిగొల్పుతోన్న పాకిస్థాన్‌ను అంతర్జాతీయంగా ఏకాకిని చేసేందుకు కేంద్రం రంగం సిద్ధం చేసింది. పాక్ ఉగ్ర కుట్రలను ప్రపంచదేశాలకు వివరించడం కోసం ఏడు అఖిలపక్ష బృందాలను ఏర్పాటు చేసింది. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నందుకు పాక్‌పై తీసుకుంటున్న దౌత్య చర్యల్లో భాగంగా విదేశాలకు భారత ప్రతినిధి బృందాలను పంపేందుకు కేంద్ర ప్రభుత్వం కొందరిని ఎంపిక చేసింది. వీరంతా వివిధ దేశాలకు వెళ్లి పాక్ ఉగ్ర కుట్రలను వివరిస్తారు. ప్రపంచదేశాలకు వివరించడం కోసం ఏడు అఖిలపక్ష బృందాలను మిగతా 2లో..

## పాక్‌కు గూఢచర్య సేవలు

### యూట్యూబర్ సహా ఆరుగురి అరెస్ట్

**న్యూఢిల్లీ,దీక్షప్రభ:** ఇంటిదొంగ గలు పట్టుబడ్డారు. గూఢచర్యం కేసులో యూట్యూబర్ అరెస్ట్ అయ్యారు. పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తూ.. భారత్‌కు చెందిన సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్నారన్న ఆరోపణలపై హరియాణాలో ఆరుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారిలో ఒక మహిళా యూట్యూబర్ కూడా ఉన్నారని శనివారం వెల్లడించారు. వీరంతా పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐకు చెందినవారితో తరచూ మిగతా 2లో..

## ప్రధాని మోడీతో లోకేశ్ కుటుంబం ఆత్మీయ భేటీ



2లో

## తెలంగాణ సింహగర్జనకు సరిగ్గా 24 ఏళ్లు

### కరీంనగర్ వేదికగా కెసిఆర్ ఉద్యమ పిలుపు



2లో

## మనం శక్తివంతులం అయితనే గుర్తింపు

### ఆపరేషన్ సిందూర్‌తో మన శక్తిని చాటాం

### ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్

2లో

## ఆపరేషన్ సిందూర్‌కు మద్దతు

### అనంతలో తిరంగా ర్యాలీ

### భారత్ సత్తా చాటిందన్న మంత్రి పయ్యావుల



2లో

## ఆపరేషన్ సిందూర్..సైనికులకు సెల్యూట్

### తిరంగా ర్యాలీలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య

**హైదరాబాద్,దీక్షప్రభ:** పాక్, పీవోకేలోని టెర్రరిస్టు స్థావరాలను ధ్వంసం చేసిన సైనికులకు సెల్యూట్ చేస్తున్నానని భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. పహల్గాం టెర్రరిస్ట్ ఎటాక్‌కు ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ గ్రాండ్ సక్సెస్ అయిన నేపథ్యంలో దేశవ్యాప్తంగా తిరంగా విజయ యాత్ర చేపట్టాని బీజేపీ పిలుపునిచ్చింది. హై కమాండ్ పిలుపు మేరకు తెలంగాణ బీజేపీ యూనిట్ శనివారం హైదరాబాద్‌లో తిరంగా యాత్ర చేపట్టింది. ట్యాంక్ బండ్ మిగతా 2లో..




## పంద్రాగస్ట్ నుంచి మహిళలకు ఉచిత బస్సులు

### పచ్చదనం, పరిశుభ్రత మన బాధ్యత కావాలి

- 175 నియోజకవర్గాల్లో రైతుబజార్ల ఏర్పాటు
- సేంద్రియ కూరగాయలు అమ్మకం కోసం యత్నం
- కూరగాయల వ్యర్థాలతో ఎరువుల తయారీ పక్రియ
- కర్నూలులో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం
- స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు



**కర్నూలు,దీక్షప్రభ:** ఉచిత బస్సుప్రయాణంపై సిఎం చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని మహిళలందరికీ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణ సదుయం కల్పిస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. కర్నూలులో ఏర్పాటు- చేసిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న సీఎం.. ఇల్లు, పరిసరాలను శుభ్రంగా ఉంచుతామని ప్రజలతో ప్రమాణం చేయించారు. రాష్ట్రంలో పచ్చదనం పెంచాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రతి నెలా మూడో శనివారం ఇళ్లు, మిగతా 2లో..

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు.. కన్నదీ విన్నదీ నలుగురితో పంచుకున్నదీ ప్రజలకు అందించాలని..వారి సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలకు దిక్సూచిగా మారాలని అనుకుంటున్నారా? విశాలవంతమైన జర్నలిజం వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

రండి.. అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..!!

దీక్ష ప్రభ
తెలుగు దినపత్రిక

జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారిగా రిపోర్టర్లు కావలెను

మీకో చక్కని వేదికగా నిలుస్తోంది. ఎవరి ఒత్తిడి లేని విలేకరి వృత్తిని చాటేందుకు సాదరంగా ఆహ్వానిస్తోంది.

సంప్రదించండి
95500 21491

# మహిళలే దేశానికి ఆదర్శం

(మొదటిపేజీ తరువాయి)

ఈ నెల 21న ఇందిరా మహిళ స్టాళ్లను మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు సందర్శిస్తారు. సెర్ప్ సభ్యుల సంఖ్యను కోటి మందికి చేర్చాలి. కార్పొరేట్ కంపెనీలకు డబ్బులు ఇస్తే తీసుకొని పలువురు దేశం విడిచి పారిపోతున్నారు. మహిళలకు ఇచ్చే ప్రతి రూపాయి వడ్డీతో సహా చెల్లిస్తున్నారని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు-చేసిన స్టాళ్లను పరిశీలించారు. మహిళలే దేశానికి ఆదర్శం అని అన్నారు. మహిళలు కోటీశ్వరులు కావాలని, మహిళలకు అండగా నిలబడతానని, ఆర్థికంగా ఎదగండని రేవంత్ రెడ్డి సూచించారు. మహిళలు ఆర్థిక శిక్షణ పాటిస్తున్నారని, ఆడబిడ్డలను ప్రోత్సహించాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. ఆడబిడ్డలు వ్యాపారంలో నిలదొక్కుకుంటే.. కుటుంబాలు ఆర్థికంగా బాగుంటాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలకు ఒక యూనిక్ ఐడి కార్డు ఇస్తామని, మహిళల ఆరోగ్యం నుంచి సంపాదన వివరాలన్నీ తెలిపేలా యూనిక్ ఐడి కార్డు లభిస్తుందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.



## సిఎంతో నోబెల్ గ్రహీత అభిజిత్ భేటీ

**హైదరాబాద్,దీక్షప్రభ:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఆర్థికశాస్త్ర నిపుణుడు, నోబెల్ అవార్డు గ్రహీత అభిజిత్ బెనర్జీ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. త్వరలో తెలంగాణ రైజింగ్ విజన్ బోర్డు ఏర్పాటు చేయనున్నట్టు- చెప్పారు. ఈ బోర్డులో భాగస్వామ్యం కావాలని అభిజిత్ బెనర్జీని కోరగా.. అందుకు ఆయన అంగీకరించారు. ఫ్యూచర్ సిటీలో ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, సృజనాత్మకతను భాగం చేయాలని అభిజిత్ బెనర్జీ సూచించారు. సంప్రదాయ చేతివృత్తుల వారిని ఆధునిక వ్యాపారవేత్తలుగా మార్చేందుకు ప్రత్యేక స్వల్పకాలిక కోర్సులు నిర్వహించాలని సలహా ఇచ్చారు.ఆర్థిక శాస్త్ర నిపుణుడు, నోబెల్ అవార్డు గ్రహీత అభిజిత్ బెనర్జీ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తో మర్యాదపూర్వకంగా భేటీ- అయ్యారు. ఈ సందర్భంగా ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో చేపట్టిన పథకాలు, రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై కాసేపు ముచ్చటించారు. శనివారం బంజారాహిల్స్ లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్లో జరిగిన ఈ సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర ఆర్థిక వృద్ధి, ఆదాయాన్ని పెంచేందుకు ఉన్న మార్గాలు, ఆర్థిక క్రమశిక్షణ, పట్టణాభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి సృష్టించడంతో పాటు తదితర అంశాలు ఈ సందర్భంగా చర్చకు వచ్చాయి. శతాబ్దాల చరిత్ర ఉన్న హైదరాబాద్ విజన్‌ను, ఇక్కడ తయారయ్యే ఉత్పత్తులకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆదరణ గురించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆయనకు వివరించారు. తెలంగాణకు సంబంధించిన విశిష్టతను, ఇక్కడున్న అనుకూలతలను ప్రపంచమంతటా చాటిచెప్పాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలు, రైతుల సాధికారత, యువతకు ఉద్యోగాలతో పాటు స్కిల్ డెవలప్మెంట్ దిశగా ప్రభుత్వం చేపడుతున్న విప్లవాత్మక చర్యలను ప్రస్తావించారు.

## ఢిల్లీలో ఈదురుగాలులతో భారీ వర్షం

(మొదటిపేజీ తరువాయి)

ఖాళీ చేయించారు. గాయపడిన వారిని చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్చారు. ఢిల్లీ పోలీసులు, అగ్నిమాపక దళం బృందాలు సంఘటనా స్థలంలో సహాయ చర్యలలో నిమగ్నమయ్యాయి. ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే ఇమ్రాన్ హుస్సేన్ ప్రమాదం గురించి సమాచారాన్ని పంచుకున్నారు. మృతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మృతుల్లో ఇద్దరు బీహార్, ఒకరు ఉత్తరప్రదేశ్‌కు చెందినవారున్నారు. బీహార్‌లోని ముంగేర్‌కు చెందిన 65 ఏళ్ల ప్రభు, ముంగేర్‌కు చెందిన 40 ఏళ్ల నిరంజన మరణించారు. ఉత్తరప్రదేశ్‌లోని అజంగఢ్‌కు చెందిన రోషన్ (35) కూడా ఈ ప్రమాదంలో మృతి చెందారు.ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే ఇమ్రాన్ హుస్సేన్ మాట్లాడుతూ.. సాయంత్రం 5:30 గంటలకు సమాచారం అందింది. నిర్మాణంలో ఉన్న ఇంటి గోడ కూలిపోయి కొంతమంది చనిపోయారని నాకు చెప్పారు. గాయపడిన వారిని చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్చారు. ఇంటి గోడ కూలిపోవడానికి గల కారణాలను తెలుసుకోవడానికి దర్యాప్తు నిర్వహిస్తాం. పహార్‌గంజ్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న భవనం కూలిపోయిన తరువాత, కఉఎ, డాగ్ స్క్వాడ్ బృందాలు సంఘటన స్థలానికి చేరుకున్నాయని తెలిపారు.

## ఆపరేషన్ సిందూర్..సైనికులకు సెల్యూట్

(మొదటిపేజీ తరువాయి)

అంబేడ్కర్ విగ్రహం నుంచి స్వామి వివేకానంద విగ్రహం వరకు భారీ ర్యాలీ తీశారు. ఈ ర్యాలీకి హాజరైన వెంకయ్య నాయుడు మాట్లాడుతూ.. మనది శాంతి కోరుకునే దేశమని.. భారత్ ఎప్పుడూ ఏ దేశం మీద ముందుగా దాడి చేయలేదని అన్నారు. పాక్‌తో ఉద్రిక్తతల వేళ ప్రధాని మోడీ ప్రదర్శించిన సమయస్ఫూర్తిని మెచ్చుకోవాలన్నారు. దేశ అంతర్గత భద్రతకు ముప్పు వాటిల్లితే ప్రజలు కుల, మత, భాష, ప్రాంతాలకు అతీతంగా ఉండాలని కోరారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయాన్ని పురస్కరించుకొని, మన దేశ సైనికులకు సంఘీభావంగా హైదరాబాద్ ట్యాంక్ బండ్ రోడ్డులో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు పాల్గొన్నారు. భారత్ మాతా కీ జై అంటూ నినాదాలు చేశారు. ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న డాక్టర్. బీఆర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి ప్రారంభమైన 'తిరంగా ర్యాలీ'.. సచివాలయం జంక్షన్ మీదుగా సైనిక ట్యాంక్ వరకు కొనసాగింది.

## ప్రధాని మోడీతో లోకేశ్ కుటుంబం ఆత్మీయ భేటీ



**న్యూఢిల్లీ,దీక్షప్రభ:** ప్రధాని నరేంద్ర మోదీతో ఏపీ మంత్రి నారా లోకేష్ ఫ్యామిలీ భేటీ-అయింది. ఢిల్లీలోని ప్రధాని నివాసంలో ఈ భేటీ జరిగింది. శనివారం సాయంత్రం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసానికి చేరుకున్న మంత్రి నారా లోకేష్ కుటుంబ సభ్యులు ప్రధానిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మంత్రి నారా లోకేష్, ఆయన సతీమణి బ్రాహ్మణి, కుమారుడు దేవాన్ష్ ప్రధానిని కలిశారు. అమరావతి పునర్నిర్మాణం కార్యక్రమం సందర్భంలో కుటుంబ సమేతంగా వచ్చి తనను కలవాలని నారా లోకేష్‌ను ప్రధాని మోదీ కోరిన నేపథ్యంలో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా నారా లోకేష్, బ్రాహ్మణిని కుటుంబ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న ప్రధాని మోదీ, దేవాన్ష్‌ను ఆప్యాయంగా దగ్గరికి తీసుకుని మాట్లాడారు. ఈ భేటీలో రాష్ట్రంలోని పలు అంశాలు వీరిరువురి మధ్య చర్చకు వచ్చినట్టు- సమాచారం.

## మనం శక్తివంతులం అయితనే గుర్తింపు

**జయపుర,దీక్షప్రభ:** ఆపరేషన్ సిందూర్‌తో మన శక్తి సామర్థ్యాలు ఏమిటో ప్రపంచానికి తెలిసిందని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ పేర్కొన్నారు. శక్తిసామర్థ్యాలు ఉన్నప్పుడే ప్రపంచం మన మాట వింటుందని మోహన్ భాగవత్ అన్నారు. భారత్‌లో త్యాగాలతో కూడిన సంప్రదాయం కొనసాగుతుందని.. దీన్ని మనం కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. రాజస్థాన్‌లోని జయపురలో నిర్వహించిన రవినాథ్ మహారాజ్ వర్ధంతి కార్యక్రమానికి హాజరైన ఆయన.. ఆపరేషన్ సిందూర్‌ను ప్రస్తావిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో త్యాగాల సంప్రదాయం కొనసాగుతోంది. ఈ మేరకే మనం అందరు దేవుళ్లను పూజిస్తున్నాం. ప్రపంచ దేశాల్లో భారత్ పురాతనమైనది. అందుకే మన దేశానికి పెద్దన్నయ్యగా ప్రత్యేక స్థానం ఉంది. ప్రపంచ శాంతి కోసం భారత్ పాటుపడుతోంది. అయితే మనం పాటించే సంస్కృతీ సంప్రదాయలను, విశ్వాసాలను, మత సామరస్యాలను ప్రపంచానికి బోధించాల్సిన బాధ్యత కూడా మనపై ఉందని ఆర్ఎస్ఎస్ చీఫ్ పేర్కొన్నారు. ఇటీవల నెలకొన్న భారత్-పాక్ ఉద్రిక్తతలపై మోహన్ భాగవత్ ప్రస్తావిస్తూ.. మనం మరింత శక్తిమంతంగా ఉండాలని హితవు పలికారు. 'భారత్ ఎవరినీ ద్వేషించదు. కానీ అధికారం ఉంటేనే ఈ ప్రపంచం మన మాట వింటుంది. ఇదే ప్రపంచ స్వభావం. కాబట్టి విశ్వశాంతి కోసం మనం మరింత దృఢంగా తయారు కావాలి. భారత్-పాక్ ఉద్రిక్తతల అనంతరం ప్రపంచానికి మనమేంటో చూపించాం' అని మోహన్ భాగవత్ వ్యాఖ్యానించారు. మం ఎవరి జోలికి వెళ్లం...ఎవరైనా మన జోలికి వస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు.

# పంద్రాగస్ట్ నుంచి మహిళలకు ఉచిత బస్సులు

(మొదటిపేజీ తరువాయి)

పరిసరాల్లోని శుభ్రతపై దృష్టి పెట్టాలని సూచించారు. పరిశుభ్రత మన జీవితంలో భాగస్వామ్యం కావాలన్నారు. ఇంటితో పాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే నీటిని సంరక్షించే కార్యక్రమాల్లో పాల్గొనాలని అన్నారు. ఉద్యోగులు కూడా ప్రతినెలా మూడో శనివారం శుభ్రతపై దృష్టి పెట్టాలన్నారు. రైతుబజార్లను 1999లో తానే ఏర్పాటు చేశాను. రైతులకు గిట్టుబాటుధర రావాలి.. వినియోగదారులకు తక్కువ ధరకే నాణ్యమైన ఉత్పత్తులు అందజేయాలనే ఒక మంచి ఉద్దేశంతో ఏర్పాటు చేశామని అన్నారు. మేం తెచ్చిన రైతు బజార్ల వల్ల రైతులు లబ్ధి పొందారు, వినియోగదారులకు కూడా ఎంతో మేలు జరిగిందన్నారు. మరిన్ని రైతు బజార్లను ఏర్పాటుచేస్తామని అన్నారు. కర్నూలు సి క్యాంప్ రైతు బజారును రూ.6 కోట్లతో ఆదర్శ రైతుబజారుగా అభివృద్ధి చేస్తామని అన్నారు.. పక్కనే ఉన్న స్థలంలో అండర్ గ్రౌండ్ పార్కింగ్ సదుపాయం కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా సి క్యాంప్ రైతుబజార్‌లో ఏర్పాటు- చేసిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులు, పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడారు. కూరగాయల వ్యర్థాలతో ఎరువుల తయారీ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ధనలక్ష్మి నగర్‌లో ఉద్యానవనం అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 125 రైతు బజారులు ఉన్నాయి. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో రైతు బజార్లు ఏర్పాటు చేసే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. రైతు బజార్లకు సేంద్రియసాగులో పండించిన కూరగాయలు వచ్చేలా చూస్తామని చెప్పారు. ప్రపంచం గర్వించేలా విశాఖలో యోగా దే నిర్వహిస్తాం.. ప్రధాని మోదీ కూడా వస్తున్నారు. యోగా దేను నెలరోజులపాటు నిర్వహిస్తాం. ప్రజలకు శిక్షణ ఇస్తాం అని బాబు అన్నారు. ప్రతి ఒక్కరూ రోజుకు అరగంట యోగా చేయాలని కోరుతున్నా. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో యోగా శిక్షణ ఇస్తాం. నెట్ జీరో వేస్ట్ కోసం ప్రజలంతా ఆలోచించాలని పిలుపునిచ్చారు. ఆరోగ్య రక్షణకు ఇదొక్కటే మార్గమని అన్నారు. ప్రపంచంలో ఏ వస్తువూ వృథా కాదు.. అన్నీ ఏదో ఒక రూపంలో ఉపయోగపడతాయి. తడిచెత్త, పొడి చెత్తను వేరు చేయాలని అన్నారు. అక్టోబరు 2 నాటికి రాష్ట్రంలో ఎక్కడా చెత్త లేకుండా చూడాలని ఆదేశించానని అందుకు ప్రజలంతా సహకరించాలని అన్నారు.. చెత్త నుంచి విద్యుదుత్పత్తి చేస్తున్నాం.. రెండు ప్రాజెక్టులు పనిచేస్తున్నాయి. రాజమహేంద్రవరం, విజయవాడ, నెల్లూరు, కడపలోనూ ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తున్నట్లు సిఎం వెల్లడించారు. డ్వాక్రా, మెప్మా మహిళలు పారిశ్రామికవేత్తలుగా మారుతున్నారు. గ్రామాల్లో చెత్తను ఎరువుగా మార్చే కేంద్రాలు ఏర్పాటు- చేస్తున్నాం. చెత్తను వేరు చేసి రీసైక్లింగ్‌కు పంపిస్తే.. వాటిని మళ్లీ వాడతారు. జపాన్‌లో ఎక్కడా రోడ్ల మీద కాగితం కనిపించదు.. అదీ సామాజిక బాధ్యత. ఆ దేశంలో రోడ్డుపై పేపర్ కనిపిస్తే ఇంటికి తీసుకెళ్లి చెత్తబుట్టలో వేస్తారు. మన రాష్ట్రంలో కూడా ప్రజల్లో చైతన్యం రావాలని చంద్రబాబు అన్నారు. రాష్ట్ర మంత్రులు నారాయణ, ఎన్ఎండీ ఫరూఖ్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి, జిల్లా కలెక్టర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకు ముందు కర్నూలు చేరుకున్న సీఎం చంద్రబాబుకు జిల్లా కలెక్టర్, ఎస్పీ, మంత్రులు, ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు.



# త్వరలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ

(మొదటిపేజీ తరువాయి)

మెట్రో టికెట్ ధరల పెంపుపై కూడా తన దృష్టికి వచ్చిందని అన్నారు. వయబుల్ కాని కారణంగా మెట్రో ఛార్జీలు పెంచినట్లుగా వారు చెబుతున్నారు.. దానిపై ప్రభుత్వం సమీక్ష చేస్తుంది.. హైదరాబాద్ ఇంఛార్జ్ మంత్రిగా తాను కూడా ఛార్జీలు తగ్గించమని ముఖ్యమంత్రిని విజ్ఞప్తి చేస్తాను అని వెల్లడించారు. నగర అభివృద్ధిపై మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన జీహెచ్ఎంసీ సమీక్ష సమావేశం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ అభివృద్ధి పనులపై చర్చించాం అని తెలిపారు. ప్రాజెక్టులను వేగంగా ముందుకు తీసుకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించాను.. వర్షాకాలంలో వచ్చే సమస్యలను తగ్గించేలా క్షేత్ర స్థాయిలో ఇంజనీరింగ్ విభాగం అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించాం.. ఇక, నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పూర్తి చేస్తాం.. స్ట్రీట్ లైట్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని నిర్ణయించాం.. అలాగే, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులు ఇప్పటి వరకు ఇంటిని ఆక్యూపై చేసుకొని వారి విషయంలో ఏం చేయాలనే అంశంలో ఆలోచిస్తున్నామని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఇదిలావుంటే రాష్ట్రంలో కొత్త టెక్నాలజీ అనుసంధానం చేస్తూ కోటి రేషన్ కార్డులన్నింటిని ఎటిఎం తరహా స్మార్ట్(చిప్) కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలన్న ప్రభుత్వ సంకల్పం మరింత జాప్యం అయ్యే అవకాశాలు ఉన్నాయి. రేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేసే చర్యల్లో స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై గత కొన్ని నెలలుగా ఎంతో కసరత్తు చేసింది. ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేకుండా పలు రాష్ట్రాల్లో అమలు అవుతున్న తీరుతెన్నులను పరిశీలించింది. దాంతో వాటి కన్నా తెలంగాణ రాష్ట్రంలోనే మెరుగైన పరిస్థితులు ఉన్నాయన్న అభిప్రాయానికి వచ్చారు. దాంతో పటిష్టమైన నిబంధనలతో కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డుల తయారీ ఏజెన్సీల ఖరారుకు ప్రభుత్వం -టెండర్లను పిలిచింది. పౌరసరఫరాల శాఖ ఇచ్చిన టెండర్ లో స్మార్ట్ కార్డు క్వాలిటీ నిబంధనలు నిర్దేశిరచారు. అంతే కాకుండా ప్రభుత్వ పర్యవేక్షణకు వీలుగా -టె-ండర్‌లో పాల్గొనే సంస్థలకు తెలంగాణ రాష్ట్రంలో ప్రధాన కార్యాలయం లేదా బ్రాంచ్ ఉండాలన్న నిబంధనను ప్రభుత్వం విధించింది. గతంలో అనుభవాలను దృష్టిలో పెట్టు-కుని ఏదైన న్యాయపరమైన వివాదాలకు తలెత్తినప్పుడు సదరు ఏజెన్సీ అందుబాటులో ఉండాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం స్పష్టంగా ఆ నిబంధనను పెట్టింది.రాష్ట్రంలో ప్రస్తుతం రేషన్ కార్డులు 90.42 లక్షలు ఉన్నాయి. వీటి ద్వారా 285.98 లక్షల మంది లబ్ధిపొందుతున్నారు. ఇంకా అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండడంతో పేదలు కొత్త రేషన్ కార్డుల కోసం ధరఖాస్తులు చేసుకుంటున్నారు. ఈ విధంగా ప్రజా పాలన కార్యక్రమంలో, మీ సేవ కేంద్రాల వద్ద కొత్త రేషన్ కార్డుల కోసం ఎక్కువ సంఖ్యలో ధరఖాస్తులు అందుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 15లక్షల మేరకు కొత్త రేషన్ కార్డుల కోసం అర్హులైన పేదలు ధరఖాస్తులు చేసుకున్నారు.

## పాక్‌కు గూఢచర్య సేవలు

(మొదటిపేజీ తరువాయి)

సంప్రదింపులు జరుపుతున్నారని, శత్రుదేశానికి సున్నితమైన సమాచారం చేరవేస్తున్నారని తెలిపారు. ఆ ఆరుగురిని హరియాణాలోని వివిధ ప్రాంతాల నుంచి అదుపులోకి తీసుకున్నారు. హిస్సార్ ప్రాంతం నుంచి అరెస్టయిన మహిళా యూట్యూబర్ పేరు జ్యోతి మల్హోత్రా అని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం న్యాయస్థానం ఆమెకు ఐదురోజుల పోలీసు రిమాండ్ విధించింది. ఆమె ఒక ట్రావెల్ బ్లాగర్, యూట్యూబర్. ఆమె పాక్‌లో పలుమార్లు పర్యటించారు. వాట్సాప్, -టె-లిగ్రామ్, స్నాప్‌చాట్ వంటి మెసేజింగ్ ఎ÷-లాట్‌ఫామ్స్‌లో పాక్ వ్యక్తులతో దేశ భద్రతకు ముప్పు తెచ్చే సమాచారాన్ని చేరవేసిందని అధికారులు ఆరోపించారు. 2023లో పాక్‌కు వెళ్లిన బృందంలో తనను కూడా ఎంపిక చేశారని, అప్పుడు అహ్సన్ ఉర్ రహీమ్ అలియాస్ డానిష్‌ను కలిశానని విచారణలో అంగీకరించినట్లు- చెప్పారు. భారత్‌కు వచ్చిన తర్వాత అతడితో సంప్రదింపులు కొనసాగించింది. అహ్సన్ సూచన మేరకు ఆమె.. అలీ అహ్సన్ అనే వ్యక్తిని కలుసుకుంది. పాక్ నిఘా, రక్షణ విభాగాలకు చెందిన వ్యక్తులను ఆమెకు అతడు పరిచయం చేశాడని సమాచారం. ఎవరి కంటాపడకుండా ఉండేందుకు తన పాకిస్థానీ కాంటాక్ట్‌ల వివరాలను ఇతర పేర్లతో సేవ్ చేశానని ఆమె అంగీకరించినట్లు- తెలుస్తోంది. ఆమె నిరంతర సంబంధాలు అఫీషియల్ సీక్రెట్స్ యాక్ట్ ఉల్లంఘన కిందికే వస్తుందని పోలీసులు వెల్లడించారు. ఆమె పంపిన సమాచారం, ఇతరుల ప్రమేయం గురించి అధికారులు ఆరా తీస్తున్నారు.

## పాక్ దుర్నీతిని ఎండగట్టేందుకు దౌత్యనీతి

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ ప్రతినిధుల బృందాలకు నాయకత్వం వహించే ఏడుగురు ఎంపీల పేర్లను శనివారం కేంద్రం ప్రకటించింది. వీరిలో కాంగ్రెస్ నుంచి సీనియర్ నాయకుడు శశిథరూర్ ఉన్నారు. ఈ ఏడుగురిలో ఎంపీలు శశిథరూర్ (కాంగ్రెస్), రవిశంకర్ ప్రసాద్(భాజపా), బైజయంత్ పాండా (భాజపా) సంజయ్ కుమార్ ఝా(జేడీయూ), కనిమొళి (డీఎంకే), సుప్రియా సూలే (ఎన్సీపీ -ఎస్పీ), శ్రీకాంత్ శిందే (శివసే)లు ఉన్నారు. వీరంతా విదేశాల్లో భారత బృందాలకు నాయకత్వం వహించనున్నట్లు కేంద్రం వెల్లడించింది. వీరి నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన మొత్తం ఏడు గ్రూపులు 10 రోజుల వ్యవధిలో ఐదు దేశాలకు వెళ్తాయి. ఉగ్రవాద కార్యకలాపాలకు పాకిస్థాన్ ఏవిధంగా మద్దతు పలుకుతోందనే విషయాన్ని.. ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదంపై భారత్ జరిపిన పోరాటాన్ని పలు ఆధారాల ద్వారా విదేశాలకు వివరించనున్నట్లు సమాచారం. ఈ బృందాలు ముఖ్యంగా ఐదు అంశాలను ప్రపంచ దేశాలకు వివరించ నున్నారు. ఆపరేషన్ సిందూర్ చేపట్టడానికి కారణమైన పాకిస్థాన్ రెచ్చగొట్టే చర్యలు, పాక్ బెదిరింపులకు ధీటుగా భారత్ ఆపరేషన్ సిందూర్‌ను ఎలా చేపట్టిందో వివరించడం, భవిష్యత్తులో భారత్‌పై ఉగ్రదాడులు జరిగితే ప్రభుత్వం తీసుకునే చర్యలపై స్పష్టత ఇవ్వనున్నారు. అలాగే ఆపరేషన్ సమయంలో ఉగ్రవాద స్థావరాలను మాత్రమే కచ్చితంగా లక్ష్యంగా చేసుకొని దాడులు చేశామని, పౌరులకు ఎలాంటి హానీ చేయలేదని స్పష్టతనివ్వడం చేస్తారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ..ఉగ్రవాదులకు సహకరించడంలో ఎన్నో ఏళ్లుగా పాకిస్థాన్ అనుసరిస్తున్న పాత్రను.. దానివల్ల ప్రపంచదేశాలకు పొంచిఉన్న ముప్పును కూడా ఈ సందర్భంగా వివరించడం జరుగుతుంది.

## తెలంగాణ సింహగర్జనకు సరిగ్గా 24 ఏళ్లు

**హైదరాబాద్,దీక్షప్రభ:** దశాబ్దాలపాటు- దగాపడ్డ తెలంగాణ ప్రజల ఆకాంక్షలే లక్ష్యంగా ప్రత్యేక రాష్ట్ర సాధనకు పునాది వేసిన తెలంగాణ సింహగర్జనకు సరిగ్గా 24 ఏళ్లు అవుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తు చేశారు. కరీంనగర్ వేదికగా ఉద్యమ రథసారథి కేసీఆర్ ఆనాడు పూరించిన సమరశంఖం ఢిల్లీ వరకూ ప్రతిధ్వనించిన అపూర్వ సందర్భమది అని పేర్కొన్నారు. తెలంగాణ నలువైపుల నుంచి లక్షలాదిగా తరలివచ్చిన ఆ జనప్రవాహం.. ఓ సముద్రాన్నే తలపించిన చారిత్రక సన్నివేశమది. తెలంగాణ వచ్చేదా సచ్చేదా అని ఎంతో మంది అడుగడుగునా అవమానించినా, రకరకాలుగా అవహేళన చేసినా వెన్నుచూపని ఆ ధీరోదాత్తుడి సంకల్పం ప్రపంచ ఉద్యమాల చరిత్రలోనే ఓ చెరగని సంతకం. ఒక అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ, ఒక్కరితో మొదలైన ఆనాటి ప్రయాణం అనుకున్న గమ్యాన్ని ముద్దాడటమే ఒక చారిత్రక విజయమైతే.. ఇక ఉద్యమ నాయకుడే ఉత్తమ పాలకుడై, సాధించిన తెలంగాణను పదేళ్లలోనే దేశానికే దారిచూపి దీపస్తంభంలా తీర్చిదిద్దిన ఆ దార్శనికత.. ప్రతి తెలంగాణ బిడ్డకు ఎప్పటికీ గర్వకారణం అని కేటీ-ఆర్ పేర్కొన్నారు. జై తెలంగాణ.. జై కేసీఆర్ అని కేటీఆర్ వివరించారు.

## ఆపరేషన్ సిందూర్‌కు మద్దతు



**అనంతపురం,దీక్షప్రభ:** ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన నేపథ్యంలో దేశ సైనికులకు కృతజ్ఞతలు తెలుపుతూ అనంతపురంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. త్రివిధ దళాల సైనికులకు సంఘీభావంగా.. జాతీయ జెండా చేత పట్టు-కుని నగర వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. మంత్రులు పయ్యావుల కేశవ్, సత్యకుమార్.. ఎమ్మెల్యేలు దగ్గుపాటి, పల్లె సింధూర, బండారు శ్రావణి ఇతర ప్రజా ప్రతినిధులు సహ జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ జగదీష్ ,మాజీ సైనికులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నగరంలోని ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్స్ నుండి సప్తగిరి సర్కిల్ వద్ద ఉన్న జాతీయ జెండా స్తంభం వరకు జాతీయ జెండాలను ప్రదర్శిస్తూ తిరంగా యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ... ఆపరేషన్ సింధూర్ ద్వారా ప్రపంచానికి మన త్రివిధ దళాల సత్తా చాటామన్నారు. ఉగ్రవాదం పేరుతో దేశాభివృద్ధిని అడ్డుకునే కుట్రలు, కుతంత్రాలు దేశాన్ని ఏమీ చేయలేవన్నారు. మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో మన దేశ సైన్యం శక్తి ఏంటన్నది యావత్ దేశానికి తెలిసిందన్నారు. పెహల్గాంలో అమాయక పర్యాటకుల ప్రాణాలు తీస్తే.. మన సైనికులు కేవలం ఉగ్రవాద శిబిరాలపై మాత్రమే దాడులు చేశారన్నారు. గుంటూరులో ఆపరేషన్ సింధూర్ సైనికులకు మద్దతుగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, రామాంజనేయులు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, మేయర్ కోవెలమూడి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. ర్యాలీకి భారీగా హాజరైన ప్రజలు.. జాతీయ జెండాలతో నగరవీధులలో ర్యాలీ నిర్వహించారు. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. పహల్గాంలో ఉగ్రవాదుల దాడి అత్యంత దుర్మార్గం అని పేర్కొన్నారు. ఆపరేషన్ సింధూర్‌తో ఉగ్రవాదులను అంతం చేశామనన్నారు. ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొన్న సైన్యానికి హట్సాఫ్ అని, దేశం కోసం ప్రాణాలు అర్పించిన మురళీ నాయక్ త్యాగాన్ని దేశ ప్రజలు మర్చిపోరన్నారు. ఎన్డీఏ ప్రభుత్వానికి దేశ రక్షణే మొదటి ప్రాధాన్యం అని పెమ్మసాని చెప్పుకొచ్చారు.

# ప్రజల సమస్యల పరిష్కారంలో విఫలం

- కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలులో ఘోరంగా విఫలం
- సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే.ప్రభాకర్ రెడ్డి




**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ఘోరంగా విఫలం చెందిందని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే ప్రభాకర్ రెడ్డిశనివారం నందికొట్కూరు పట్టణంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో పత్రిక విలేకరుల సమావేశంలో విమర్శించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారం చేపట్టి సంవత్సరం గడిచిన అమలు చేయడంలో విఫలం చెందిందని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలలో పెన్షన్లు,డీఎస్సీ విడుదల పథకాలు అమలు చేయడం అని చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం కేవలం అమరావతి, పోలవరం జపం చేస్తూ కాలం వెళ్లదీస్తుందని అన్నారు. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలిచి అమరావతి శంకుస్థాపన చేయించారన్నారు. పోయినసారి శంకుస్థాపన చేయించినప్పుడు పిడికెడు నీళ్లు పిడికెడు మట్టి మొహాన కొట్టారు అని విమర్శించారు. ఈసారి అది కూడా లేదు ఉత్త మాటలే చెప్పారన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ రాష్ట్రానికి చేసింది ఏమీ లేదని తెలిపారు. సభలో నరేంద్ర మోడీ చంద్రబాబును పొగడడం, చంద్రబాబు నాయుడు నరేంద్రమోడీని పోవడం తప్ప కేంద్రం నుంచి రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని విమర్శించారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీ ప్రత్యేక హోదా మాటలు లేవు, రాష్ట్రంలో వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధికి నిధిలో కేటాయింపు మాటలు లేవన్నారు. అదేవిధంగా జాతీయ విద్యా సంస్థలు ఏర్పాటును గురించి స్పష్టత లేదన్నారు. విశాఖ ఉక్కు కాపాడుతామని స్పష్టత లేదు, కడప ఉక్కు పరిశ్రమకు నిధులు ఇస్తామన్న స్పష్టత లేదన్నారు. ఇవేమీ చెయ్యకపోయినా నరేంద్ర మోడీ లాంటి నాయకుడు మనకు ఎవరూ లేరని చంద్రబాబు పొగుడుతున్నారన్నారు. పరస్పరం చంద్రబాబు నాయుడు నరేంద్ర మోడీ పొగడ్తలు తప్ప ఈ రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. గడచిన సంవత్సర కాలంలో రైతంగం తీవ్రమైన ఆందోళనలో ఉన్నారని తెలిపారు. మిర్చి వేసిన ఏ ఒక్క రైతు సంతృప్తిగా లేరన్నారు. ఒక ఎకరా మిర్చి వేసిన రైతు లక్ష నుంచి రెండు లక్షల వరకు అప్పుల్లో కూరుకు పోయారన్నారు. పొగాకు వేసిన రైతుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. అగ్రిమెంట్ ఇచ్చిన కంపెనీలు పొగాకును కొనుగోలు చేయడం లేదన్నారు. పొగాకు రైతులు తమ పండించిన పంటను తగలబెట్టి ఆందోళన నిర్వహిస్తున్నారన్నారు. జొన్న, సెనగ, మినుములు, పెసలు, ఏ ఒక్క పంటకు గిట్టుబాటు ధర లేదని విమర్శించారు. అంబేద్కర్ కోనసీమ, కృష్ణా, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి డెల్టా ప్రాంతంలో వరి పండించిన రైతులు ప్రభుత్వం కొనుగోలు చేయకుండా టార్గెట్ల పేర్లతో రైతులను ఇబ్బంది పెడుతుంటే రైతులే స్వచ్ఛందంగా ఆందోళన నిర్వహిస్తున్నారని తెలిపారు. మొత్తం రాష్ట్రవ్యాప్తంగా అన్ని రకాల పంటలు వేసిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలోనే రైతుల ఆదాయం రెట్టింపు అయిందని తెలిపారున్నారు. రెట్టింపు కాదు రైతులు అప్పుల పాలవుతున్నారని, రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని విమర్శించారు. రైతులను పట్టించుకోవాలని తెలిపారు. ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. పేదల కోసం ఉపాధి హామీ చట్టం వస్తే దాన్ని భూస్వామి ప్రయోజనాల కోసం అనుసంధానం చేసే దిశగా కేంద్రాల ప్రభుత్వాలు ప్రయత్నం చేస్తున్న అన్నారు. కార్మికుల చట్టాలను కాలరాసే పద్ధతిలో 12 గంటలు పని చేయాలి, కనీస వేతనం సంబంధించిన చట్టాలను అమలు చేయమని, ఎనిమిది గంటల పని విధానం గురించి మాట్లాడే పరిస్థితి లేదన్నారు. భవన నిర్మాణ కార్మిక సెస్సు ప్రతి బిల్డింగ్ యజమాను నుండి వసూలు చేస్తున్నారని తెలిపారు కానీ వాటిని భవన నిర్మాణ కార్మికులకు వాడడం లేదన్నారు. కౌలు రైతుల కోసం కొత్త చట్టం తీసుకొని వస్తామని ఊరికి మాటలే తప్ప సంవత్సరమైనా ఇంతవరకు దాని పరిస్థితి ఏమి లేదన్నారు. అందుకే రైతులు వ్యవసాయ కార్మికులు కర్షకులు ఈనెల 20వ తేదీ దేశవ్యాప్తంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా గ్రామ గ్రామాన నిరసనలు తెలియజేయ బోతున్నారన్నారు. రాయలసీమ జిల్లాలో అనంత పురం, సత్యసాయి, నంద్యాల కడప, కర్నూల్, కడప అన్ని జిల్లాలలో లక్షల ఎకరాలు పొలాలు సోలార్ కంపెనీలకు కట్టబెడుతున్నారన్నారు. ఒకపక్క ప్రతి రైతు కుటుంబంలో లక్షాధికారిణి చేస్తానంటూ, రైతులను బిక్షాధికారి చేస్తున్నారంటూ విమర్శించారు. సోలార్ కంపెనీల మోజులో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఉందన్నారు. సోలార్ కంపెనీలు రావడం అంటే కారు చౌకగా రైతుల భూములను కొలగొట్టడమేమన్నారు. వాటి వల్ల కార్పొరేట్ కంపెనీలకు లాభాలను తెచ్చిపెట్టడమేనని విమర్శించారు. అలాగే నేడు ప్రవేశపెడుతున్న విద్యుత్ రంగంలో సంస్కరణలు ప్రజలపై భారాన్ని మోపుతున్నాయని విమర్శించారు. విద్యుత్ కంపెనీలకు లక్షల కోట్ల రూపాయలను లాభాలు తెచ్చిపెడుతున్నారని విమర్శించారు. గతంలో వైసిపి ప్రభుత్వం వీటిని అమలు చేయగా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం కూడా వీటిని అమలు చేస్తుందన్నారు. ఆదాని ప్రయోజనాల కోసం నరేంద్ర మోడీ ఈ విద్యుత్ సంస్కరణలో ప్రవేశపెట్టి ప్రజలపై భారాన్ని మోపి విద్యుత్ రంగా సంస్కరణలు వెనక్కి తీసుకోవాలని సిపిఎం పార్టీగా డిమాండ్ చేస్తున్నామన్నారు. వెతికి వ్యతిరేకంగా ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరరావు మాట్లాడుతూ... జూపాడుబంగ్లా మండలంలోని తంగడంచ గ్రామంలో నేషనల్ సీడ్ ఫారంకు సంబంధించి దాదాపు 1600 ఎకరాలు సారవంతమైన భూమిని అంబుజ కంపెనీకి తీసుకొని అక్కడ పరిశ్రమలు పెట్టకుండా ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా ఉపాధి కల్పించకుండా మంచి భూములను బీడు భూములుగా మార్చిన పరిస్థితిని చూస్తున్నామని తెలిపారు. మంచి పంటలు పండే ఆ భూములలో సోలార్ కంపెనీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం కొత్త ప్రతిపదనులు చేపడుతుందన్నారు. ఇది రైతాంగ విధానాలకు వ్యతిరేకమన్నారు. ప్రజలకు నష్టమైన ఈ అభిప్రాయం ను ప్రభుత్వం అనుసరిస్తుందని విమర్శించారు. అలాగే మిడుతూరు మండలంలో లిఫ్ట్ ఇరిగేషన్ హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే అలగనూరు గండిని పూడ్చివేయాలని డిమాండ్ చేశారు. తంగడంచ ఎన్ ఎస్ ఫారంలో భూములను సాగు చేసి సీడ్ ఉత్పత్తి చేసి దేశం మొత్తానికి రైతుల ఆత్మహత్యలను నివారించడానికి మంచి విత్తనాలు నాణ్యమైన విత్తనాలను అందించడానికి ఈ ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రైతులను మత్స్యకారులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ రాజశేఖర్, సిఐటి జిల్లా నాయకుల గోపాలకృష్ణ ఉస్మాన్ భాష, సిపిఎం నాయకులు కొంగర వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## స్వర్ణాంధ్ర స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో మాండ్ర,ఎమ్మెల్యే

**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** నందికొట్కూరు మండల పరిధిలోని 10-బొల్లవరం గ్రామంలో శనివారం పారిశుద్ధ్య కార్మికులతో కలిసి స్వర్ణాంధ్ర స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో పాల్గొని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇంచార్జ్ మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే జయసూర్య ప్రజలకు సూచిస్తూ పరిసరాలను పరిశుభ్రం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి,మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రసాద రెడ్డి,బాబురెడ్డి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్,రమేష్ రెడ్డి, మహేశ్వరరెడ్డి,సుందర్ రెడ్డి,గ్రామ మండల నాయకులు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ సీఎంకు స్వాగతం పలికిన మండ్రా,ఎమ్మెల్యేలు



**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** కర్నూలు జిల్లాకి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులతో కలిసి స్వాగతం పలికిన నంద్యాల పార్లమెంట్ ఇంచార్జ్ మాండ్ర శివానందరెడ్డి అనంతరం జిల్లాలోని పాణ్యంలో సీఎం "స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర"లో భాగంగా ఉద్యానవనం అభివృద్ధి కోసం శంకుస్థాపన చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

## పటాన్ చెరు విద్యార్థులకు సువర్ణ అవకాశం



- ఈ విద్యా సంవత్సరం నుండే పటాన్ చెరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల తరగతులు
- పారిశ్రామికవాడకు అనుగుణంగా కోర్సులు
- ఆరు ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయింపు
- గత ఎన్నికల్లో హామీ ఇచ్చాం.. నేడు అమలు చేశాం
- పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి




**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం డిగ్రీ కళాశాల భవనంలో 2025-2026విద్యా సంవత్సరానికి గాను ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల తరగతులు ప్రారంభించబోతున్నట్లు పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం సంబంధిత అధికారులతో కలిసి డిగ్రీ కళాశాల భవనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో పటాన్చెరు నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలలో భాగంగా నియోజకవర్గంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేస్తూ గత ప్రభుత్వం జీరో జారీ చేసింది అని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం కళాశాల ఏర్పాటు కోసం ప్రభుత్వ భూమితో పాటు అధ్యాపక పోస్టులు, కోర్సులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. భవన నిర్మాణం పూర్తయ్యే వరకు పటాన్ చెరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనంలో తాత్కాలికంగా తరగతులు నిర్వహించబోతున్నట్లు తెలిపారు. రాబోయే విద్యా సంవత్సరంలో కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ విభాగంలో 60 సీట్లు చొప్పున 180 సీట్లు మంజూరు అయ్యాయని తెలిపారు. 35 రెగ్యులర్ పోస్టులు, 52 ఔట్సోర్సింగ్ పోస్టులు మంజూరయ్యాయని తెలిపారు. పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పాలిటెక్నిక్ కళాశాలలో చదివిన విద్యార్థులకు స్థానిక పారిశ్రామిక వాడలోని జాతీయ,అంతర్జాతీయ పరిశ్రమల్లో ఉద్యోగ ఉపాధ్యాయ అవకాశాలు మెండుగా లభిస్తాయని తెలిపారు. భవిష్యత్తులో పాలిటెక్నిక్ కళాశాలను ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలగా అప్గ్రేడ్ చేసేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు,డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.




## శానిటైజేషన్ ఇన్స్పెక్టర్ పోస్ట్ భర్తీ చెయ్యండి : ఏఐటీయూసీ


**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** పురపాలక సంఘ కార్యాలయం నందు ఖాళీగా ఉన్న శానిటైజేషన్ ఇన్స్పెక్టర్ పోస్టులు భర్తీ చేయాలని ఏఐటీయూసీ నంద్యాల జిల్లా అధ్యక్షులు వీ రఘురాంమూర్తి మున్సిపల్ అధికారులను కోరారు. స్థానిక నందికొట్కూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ముందు కమీషనర్ బేబీ మేడంకి మరియు చైర్మన్ సుధాకర్ రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నందికొట్కూరు పురపాలక సంఘం ఏర్పడినప్పటి నుంచి శానిటైజేషన్ ఇన్స్పెక్టర్ లేకపోవడం చాలా బాధాకరమన్నారు పట్టణంలో కల్తీ ఆహార పదార్థాల పైన పారిశుద్ధ్యంపైన తదితర అంశాలపై అజమాయిషీ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యహరిస్తున్నారనీ అలాగా పారిశుద్ధ్యకార్మికులకు మేస్త్రిగా ఏ అర్హతలు లేని వ్యక్తులను నియమించడం వల్ల పట్టణంలో పారిశుధ్యం కొరబడిందన్నారు. శానిటైజేషన్ ఇన్స్పెక్టర్ మేస్త్రిగా ఉండాలంటే శానిటేషన్ కోర్స్ చేయాలి. లేకపోతే పది సంవత్సరాలు పారిశుద్ధ కార్మికునిగా పని చేయాలి నిబంధనలకు విరుద్ధంగా నియమించిన వారిని తక్షణమే తొలగించి అర్హత కలిగినటువంటి వారిని రాజకీయ జోక్యం లేకుండా నియమించాలని డిమాండ్ చేశారు.

## మీ సేవ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల జీవన్ ప్రసాద్ కు అభినందించిన మొయిన్ బృందం




**జహీరాబాద్,దీక్ష ప్రభ:** ఇటీవల తెలంగాణ మీ సేవ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన బత్తుల జీవన్ ప్రసాద్ కు శనివారం నాడు మహా నగరంలోని శామీర్ పేటలోని బ్రిందవన్ ఇన్ హోటల్ లో జరిగిన కార్యక్రమంలో హాజరై వారికి తెలంగాణ రాష్ట్ర మీ సేవ అసోసియేషన్ కంటెస్టెడ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ మెయిన్ బృందం వారికి పూలమాల శాలువకప్పి ఘనంగా సన్మానించి అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహమ్మద్ మెయిన్ మాట్లాడుతూ..ఎన్నికల్లో పోటీ చెయ్యడం సహజం అందులో ఒకరు గెలిస్తే మిగతా వారు ఓడిపోవడం ఖాయం,ఎన్నికల్లో పై చెయ్యి సాధించడానికి కొన్ని మాటలు చెప్పడం సర్వసాధారణం, అప్పటి విషయాలను మనసులో పెట్టుకోకుండా ముందుకు వెళ్ళి అందరూ సమన్వయంగా ముందుకు వెళ్దామని అన్నారు.

# స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్రలో సీఎం చంద్రబాబు నాయుడు





**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** కర్నూలు జిల్లా, పాణ్యం నియోజకవర్గంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీ క్యాంప్ రైతుబజార్‌కు సీఎం వెళ్ళారు. అక్కడ రైతులు, పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడారు. కూరగాయల వ్యర్థాలతో ఎరువుల తయారు చేసే విధానాన్ని పరిశీలించారు. అనంతరం ఉద్యానవన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పురపాలక మరియు పట్టణాభివృద్ధిశాఖ మంత్రివర్యులు, పొంగూరు నారాయణ ,నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య , పాణ్యం ఎమ్మెల్యే చరితమ్మ, నందికొట్కూరు ఇంచార్జి వెంకటరెడ్డి,కర్నూలు ఎమ్మెల్యే మరియుమంత్రి, టీజీ భరత్,ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు ఎంపీలు నాయకులు ప్రభుత్వ జిల్లా కలెక్టర్లు పాల్గొనడం జరిగింది.

# వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి సాక్ష్యం "రిపిక "

- ఐదేళ్లుగా పింఛన్ కోసం పోరాడుతున్న తల్లిదండ్రులు
- సదరం సర్టిఫికెట్ లేకపోవడంతో వదిలేసిన వైసీపీ ప్రభుత్వం
- ఎమ్మెల్యే జయసూర్య దృష్టికి తీసుకొచ్చిన కుటుంబ సభ్యులు
- కూటమి ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఎమ్మెల్యే జయసూర్య హామీ





**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** గత వైసీపీ ప్రభుత్వ అసమర్థత ఇదేళ్ల పాలనకు నిలువెత్తు సాక్ష్యం రిపిక. నందికొట్కూరు నియోజకవర్గం పగిడ్యాల మండలం పగిడ్యాల గ్రామానికి చెందిన విజయ శేఖర్,అనిత లకు ఇద్దరు కుమార్తెలు. పెద్దకూతురు రిపిక, చిన్న కూతురు ఏంజిల్. పెద్ద కూతురు రిపికకు పదకొండేళ్లు.మానసిక వికలాంగురాలు. పగిడ్యాలలోని భవిత పాఠశాలలో చదువుతుంది.రిపిక ఇదేళ్ల వయసు వరకు ఆరోగ్యంగానే ఉంది. అందరి పిల్లల వలె ఆడుతూ పాడుతూ హుషారుగా ఉండేది. కాలం పగ పట్టి అరేళ్ళ వయసులో అనారోగ్యంతో తల్లిదండ్రుల ఆసరా లేకుండా మాట్లాడలేదు..తినలేదు.. నడవలేదు.రిపిక తల్లిదండ్రులది నిరు పేద కుటుంబం. ఉండడానికి కనీసం ఇల్లు కూడా లేదు. కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోసిస్తున్నారు. కూతురు వైద్యం కోసం ఖర్చులు కూడా భరించలేని పరిస్థితి.కాయకాష్టంతో పాప చికిత్స కోసం వైద్యులకు చూపించారు. పాప ఆరోగ్య పరిస్థితి మెరుగు పడలేదు. కనీసం ప్రభుత్వం పింఛన్ ఇచ్చి ఆదుకుంటుందని భావించిన వారికీ వైసీపీ ప్రభుత్వం మొండిచేయి చూపించింది. ఇదేళ్ల పాలనలో రిపీకకు పింఛన్ ఇప్పించడంలో విఫలమైంది. మెదడు ఎదుగుదల సమస్యతో బాధపడుతున్న కూతురుకు వైద్య పరీక్షలు చేయించిన ఫలితం రాలేదని తల్లిదండ్రులు ఆవేదనచెందారు. వైసీపీ పాలనలో సదరం సర్టిపికెట్స్ కోసం కాళ్లు అరిగేలా తిరిగిన న్యాయం జరగలేదని కన్నీరు మున్నీరయ్యారు.కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్యను పగిడ్యాల మండలం ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ప్రజా సమస్యల పరిస్కార వేదికలో కలిసి సమస్యతెలిపారు. తమ కూతురు కు పింఛన్ ఇప్పించాలని మోరపెట్టుకున్నారు. రిపికకు కచ్చితంగా న్యాయం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.టీడీపీ అధిష్టానం దృష్టికి పాప సమస్యను తీసుకోని వెళ్లి న్యాయం చేస్తామని తెలిపారు.



# హైదరాబాద్ రాజకీయాల్లో తనదైన పాత్ర పోషించిన వ్యక్తి రాజిరెడ్డి

- పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- బండారి రాజిరెడ్డికి ఘన నివాళులు
- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే జీఎంఆర్

**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సోదరుడు ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి ఇటీవల మరణించిన నేపథ్యంలో,లక్ష్మారెడ్డి కుటుంబాన్ని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం రాజిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఉప్పల్ నియోజకవర్గం తొలి ఎమ్మెల్యేగా పనిచేయడంతో పాటు, హైదరాబాద్ రాజకీయాల్లో తనదైన పాత్ర పోషించిన మహోన్నత వ్యక్తి రాజిరెడ్డి అని కొనియాడారు. ఆయన మరణం ఉప్పల్ ప్రజలకు తీరని లోటని అన్నారు.





## దీపికకు గణితంలో పీహెచ్ డీ

**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, గణిత శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని దీపిక ఏ.ఆర్.డాక్టరేట్ కు అర్హత సాధించారు. లీనియర్, నాన్-లీనియర్, ఎక్స్ పోనెన్షియల్ స్ట్రెచింగ్ షీట్ పై నానో ఫ్లూయిడ్ల వేడి, ద్రవ్యరాశి బదిలీ విశ్లేషణకు సంఖ్యా విధానం అనే అంశంపై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ గణిత శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.గోవర్ధన్ శనివారం ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ దీపిక చేసిన పరిశోధన నానో ఫ్లూయిడ్లతో కూడిన సంఖ్యా మోడలింగ్, ఉష్ణ బదిలీ దృగ్విషయాలపై వినూత్న అంతర్దృష్టులను అందిస్తుందని తెలిపారు. ఇది ఇంజనీరింగ్, మెటీరియల్ సైన్సెస్ లో పెరుగుతున్న ఆసక్తిని తెలియజేస్తోందన్నారు. అంతేగాక, ఈ పరిశోధనలో భాగంగా, డాక్టర్ దీపిక నాలుగు పరిశోధనా పత్రాలను స్కోపస్ ఇండెక్స్ జర్నల్ లో ప్రచురించినట్టు తెలియజేశారు. డాక్టర్ దీపిక సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, పలు విభాగాల అధిపతులు,అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు పేర్కొన్నారు. డాక్టర్ దీపిక సాధించిన విజయం, ఆయా విభాగాలలో అత్యాధునిక పరిశోధన, విద్యా నైపుణ్యాన్ని పెంపొందించడంలో గీతం యొక్క నిరంతర నిబద్ధతను నొక్కి చెబుతోందన్నారు.

## భారత్ దాడులతో తీవ్రంగానే నష్టపోయాం

- ఎట్టకేలకు అంగీకరించి పాక్ ప్రధాని

**ఇస్లామాబాద్,దీక్షప్రభ:** భారత్ దాడులపై పాకిస్తాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇన్ని రోజులు బుకాయించిన పాక్.. భారత్ దాడులు చేసిందని ఒప్పుకుంది. శుక్రవారం ఇస్లామాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాక్ ప్రధాని షరీఫ్ ప్రసంగిస్తూ.. నూర్ ఖాన్‌తోపాటు- పలు వైమానిక స్థావరాలపై భారత్ దాడులు జరిపిందని అంగీకరించారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా తమ కీలకమైన వైమానిక స్థావరాలపై భారత్ ఖచ్చితమైన దాడులు జరిపినట్లు ధృవీకరించారు. భారత ఆపరేషన్ ప్రారంభమైన కొన్ని క్షణాల తర్వాత, ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్ తనను తెల్లవారుజామున 2.30 గంటలకు నిద్రలేపారని షరీఫ్ అన్నారు. జనరల్ మునీర్.. నాకు వ్యక్తిగతంగా ఫోన్ చేసి దాడుల గురించి తెలియజేశారు. ఇది తీవ్ర ఆందోళన కలిగించే క్షణం. ఆ సమయంలో మా వైమానిక దళం స్థానిక సాంకేతిక పరిజ్ఞానం, చైనీస్ యుద్ధ విమానాలను వినియోగించిందని షరీఫ్ చెప్పారు. కాగా, బిజెపి జాతీయ ఐటీ- విభాగం చీఫ్ అమిత్ మాల్వియా.. పాక్ ప్రధాని మాట్లాడిన వీడియో ఎక్స్ లో పోస్ట్ చేస్తూ.. ఇది ఆపరేషన్ సిందూర్.. ధైర్యం, సామర్థ్యానికి నిదర్శనం అని పేర్కొన్నారు. సిందూర్‌తో ఉగ్రవాదుల్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కు భారత్ గట్టిగా బుద్ధి చెప్పిన విషయం తెలిసిందే. పహల్గాం ఉగ్రదాడికి 'ఆపరేషన్ సిందూర్' తో పాక్ పై భారత సైన్యం ప్రతీకారం తీర్చుకుంది. ఆ దేశంలోని ఉగ్ర స్థావరాలు, వైమానిక స్థావరాలను ధ్వంసం చేసింది. భారత్ దాడితో తోకముడిచిన దాయాది.. చివరికి కాళ్లబేరానికి వచ్చింది. అయితే, ఇన్నాళ్లూ తమకు జరిగిన నష్టాన్ని కప్పిపుచ్చుకుంటూ వస్తోన్న పాక్.. తాజాగా దాన్ని అంగీకరించింది. తమ కీలక ఎయిర్‌బేస్‌లపై భారత్ వైమానికి దాడులు జరిపిందని ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మీడియా సాక్షిగా ఒప్పుకున్నారు. మే 10 తెల్లవారుజామున ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా తమ కీలకమైన వైమానిక స్థావరాలపై భారతదేశం జరిపిన ఖచ్చితమైన దాడులను ధ్రువీకరించారు.

# ప్రతి కాలనీకి రక్షిత మంచినీరు



- పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీలకు సైతం రక్షిత మంచి నీరు అందించేందుకు కృషి చేస్తున్నామని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్ చెరు డివిజన్ పరిధిలోని కృషి డిఫెన్స్ కాలనీలో గల అపార్ట్మెంట్ వాసుల కోసం 20 లక్షల రూపాయలతో చేపట్టనున్న పైపులైన్ పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి ఒక్కరికి మంచినీరు అందించాలని లక్ష్యంతో నూతన రిజర్వాయర్లు, పంపు హౌస్ లు నిర్మిస్తున్నామని తెలిపారు.ఉపాధి అవకాశాలకు అనుగుణంగా నూతన కాలనీలు ఏర్పాటు అవుతున్నాయని, వాటిలో మౌలిక వస్తువుల కల్పనకు ప్రణాళిక బద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పటాన్ చెరు కార్పోరేటర్ మెట్టు కుమార్ యాదవ్,కృషి డిఫెన్స్ కాలనీ అధ్యక్షులు అమరేందర్,ప్రధాన కార్యదర్శి మాణిక్ రెడ్డి,కాలనీ వాసులు పాల్గొన్నారు.

## స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను రూపొందించాలి

- జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్




**నంద్యాల,దీక్ష ప్రభ:** స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు అన్ని విధాల సహాయ సహకారాలు అందజేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్ కోరారు. డిఆర్ఓ ఛాంబర్ లో ఓటర్ల జాబితా రూపకల్పన పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో డిఆర్ఓ సమావేశం నిర్వహించారు. సమావేశంలో బీఎస్పీ పార్టీ ప్రతినిధి కొట్టం శ్రీనివాసులు, సిపిఎం పార్టీ ప్రతినిధి పి.నరసింహులు,బిజెపి పార్టీ ప్రతినిధి కే.చంద్రశేఖర్,టిడిపి పార్టీ ప్రతినిధి కే శివరాం రెడ్డి, వైఎస్ఆర్సిపి పార్టీ ప్రతినిధి సాయిరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్ మాట్లాడుతూ..స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు అన్ని విధాల సహాయ సహకారాలు అందజేయాలని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. బూతుల వారీగా ఓటర్ల జాబితాను రాజకీయ పార్టీ ప్రతినిధులకు అందజేశామని..ఈ మేరకు ఓటర్ల జాబితాలోని డెత్ ఓటర్లు, చేర్పులు, మార్పులు బూతు స్థాయి ఏజెంట్లతో పరిశీలించుకుని అభ్యంతరాలు ఉంటే సంబంధిత ఈఆర్ఓ, ఏఆర్ఓలకు తెలియజేయాలని డిఆర్ఓ రాజకీయ పార్టీ ప్రతినిధులకు సూచించారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు సూచించిన అంశాలను ఎన్నికల సంఘానికి నివేదిస్తామని డిఆర్ఓ తెలిపారు.రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ..80 సంవత్సరాలు పైబడిన వారికి హోం ఓటింగ్ ఎలా అవకాశం కల్పిస్తారో, అదే రీతిలో గర్భిణీ స్త్రీలకు కూడా కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిఆర్ఓ ను కోరారు. పురుష, మహిళ ఓటర్లకు కేటాయించిన పోలింగ్ బూతుల్లో కుటుంబ సభ్యులందరికీ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## కాశ్మీర్ పండిట్లలో భరోసా నింపాలి

- వారిని తిరిగి స్వస్థలాలకురప్పించాలి
- పాక్ దుశ్చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి

**న్యూఢిల్లీ,దీక్షప్రభ:** బిజెపిని అప్రతిష్టపాలు చేయడమే లక్ష్యంగా అక్కడి నేతలు ఇంతకాలం చేసిన రాజకీయ డ్రామాలకు తెరపడనుంది. పహల్గామ్ ఉగ్రదాడి, పాక్‌పై భారత్ చర్యలు, ఆపరేషన్ సిందూర్ తరవాత ఇక కాశ్మీర్ నేతల వైఖరి మారాలి. ముఖ్యంగా మెహబూబా ముఫ్తీ తనపాక్ అనుకూల వైఖరిని విడనాడాలి. ఫరూక్ అబ్దుల్లా కూడా మారాలి. కేంద్రం తీసుకుంటున్న శాంతి చర్యలకు ఇంతకాలం మెహబూబా ముఫ్తీ కూడా గండికొట్టారు. పూర్తి పాక్ అనుకూల విధానాలను నరనరాన జీర్ణించుకున్న హురియత్ నేతలు కాశ్మీర్‌లో శాంతి స్థాపనకు కేంద్రం చేసిన యత్నాలను ఆదినుంచీ గండికొట్టారు. అక్కడ 370 ఆర్టికల్‌ను అడ్డం పెట్టుకుని ఇంతకాలం హురియత్ నేతలకు తోడు మెహబూబా ముఫ్తీ, అబ్దుల్లాలు పాక్‌తో కలసి దేశ విద్రోహ చర్యలకు పాల్పడుతూ వచ్చారు. ప్రజలను రెచ్చగొడుతూ యువతను పక్కదారి పట్టించారు.అక్కడున్న పండిట్లను ఊచకోత కోశారు. మతమార్పిళ్లు చేశారు. భారత్‌తో సంబధం లేకుండా కాశ్మీర్‌ను పెంచి పోషించారు. దీనికి ముమ్మాటికీ కాంగ్రెస్‌దే బాధ్యత. 370 రద్దుతో హురియత్ నేతలకు స్థానం లేకుండా పోయింది. అలాగే అక్కడి నుంచి తరిమి వేయబడ్డ వేలాది కాశ్మీర్ పండిట్లతో కూడా సమస్యలు చర్చించడం ద్వారా వారిలో ధైర్యం కల్పించాలి. కాశ్మీర్‌లో అసలు జరుగుతున్నదేమిటో ప్రపంచానికి తెలిసింది.


# చలివేంద్రం ప్రారంభించిన జూపాడుబంగ్లా ఎంపీపీ



**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** నందికొట్కూరు నియోజకవర్గం జూపాడు బంగ్లా మండల కేంద్రం లో శనివారం స్వర్ణంద్ర స్వచ్ భారత్ కార్యక్రమంలో భాగంగా జూపాడుబంగ్లా ఎంపీపీ పి.సువర్ణమ్మ సాలివెంద్రాణి ప్రారంభించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గోపిక్రిష్ణ, డిప్యూటీ తాసిల్దార్,పంచాయతీ కార్యదర్సులు తదితరులు పాల్గొన్నారు.

## కాశ్మీర్ అంశమే పాక్ జీవనాడి

- అది లేకుంటే అక్కడ ఆర్మీ లేదు
- భారత ఆర్మీ మాజీ చీఫ్ నిర్మల్ చందర్ విజ్



**న్యూఢిల్లీ,దీక్షప్రభ:** ఆర్థిక పరంగానే కాదు.. పాకిస్థాన్ అన్ని విధాలుగా పతనమైన దేశమని ఆర్మీ మాజీ చీఫ్ నిర్మల్ చందర్ విజ్ సంచలన వ్యాఖ్యలు చేశారు.పాక్ అబద్ధాల పుట్ట అని.. వాళ్లను అస్సలు నమ్మొద్దని చెప్పారు. ఆ దేశాన్ని ప్రభుత్వం కాదు.. ఆర్మీనే నడుపుతోందన్నారు. అన్ని విధాలుగా పతనమైన పాక్‌ను కశ్మీర్ అంశమే ఐక్యతగా ఉంచుతోం దన్నారు. అన్ని సమస్యల్ని కప్పిపుచ్చుకోవడానికి కశ్మీర్‌ను ఒక ఆయుధంగా అక్కడి నేతలు, ఆర్మీ మలచుకుందన్నారు. భారత్ ఎంత శక్తిమంతమైన దేశం, మనం ఎంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తామో మొత్తం ప్రపంచం ఇప్పుడు అర్థం చేసుకుంటోందన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత సైనికాధికారులు ఇచ్చిన ఫస్ట్ బ్రీఫింగే దీనికి సరైన ఉదాహరణ అని ఆయన మెచ్చుకున్నారు. విదేశీ వ్యవహారాల శాఖ సెక్రెటరీతో కలసి ఇద్దరు మహిళా అధికారులు మాట్లాడిన తీరు, ఆపరేషన్ సిందూర్ గురించి వివరించిన విధానం అదిరిపోయిందన్నారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కు భారత్ చుక్కలు చూపించింది భారత్. పహల్గాం దాడి దరిమిలా టెర్రరిస్టులతో పాటు- వారికి అండగా ఉంటు-న్న శత్రుదేశంపై ఉరుములా విరుచుకుపడుతోంది. ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రస్థావరాల మీద అటాక్ చేయడం, ఆ తర్వాత ప్రతిదాడులకు తెగించిన పాక్‌పై డ్రోన్లు, మిసైళ్లతో ఇండియా ఓ రేంజ్‌లో విరుచుకుపడటం ప్రపంచదేశాలు కూడా చూశాయి. తమ జోలికొస్తే తాటతీస్తామంటూ భారత్ చేసిన సింహగర్జన పాక్‌తో పాటు- ఆ దేశానికి సాయం చేస్తున్న టర్కీ, అజర్‌బైజాన్, చైనాకూ వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి. యుద్ధంతోనే కాదు దౌత్యంతోనూ పాక్‌ను ఇబ్బందులపాలు చేస్తోంది ఇండియా. వాళ్ల అసలు రూపాన్ని ప్రపంచ దేశాల ముందు బయటపెట్టేందుకు సిద్ధమవుతోంది. ఈ సమయంలో భారత ఆర్మీ మాజీ చీఫ్ నిర్మల్ చందర్ విజ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కశ్మీరే పాక్ ఆయుధమని అన్నారు.

Printed,Published,Edited, & owned by **Rathod Vinod Kumar** Published from **SNEHITHA PUBLICATIONS** Falcon Printing press, # 1-2-201,Shop No.2,Khan Street Zaheerabad Town,Sangareddy District,Telangana State pin code :502220, Printed At Falcon Printing Press # 1-2-201,Shop No.2,Khan Street Zaheerabad Town,Sangareddy District,Telangana State pin code: 502220, Editor: **Rathod Vinod Kumar.** RNI NO. TELTEL/2023/87655,Cell : 9550021491,7893532721, Gmail: deekshaprabhatelugudaily@gmail.com